సాక్షి అనకాపల్లి

గురువారం । 19 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 'పేట' కోలాట బృందం



పాయకరావుపేట నుంచి తిరుమలలో కోలాటం ప్రదర్శనకు వెళ్లిన బృందం

పాయకరావుపేట: తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాయకరావుపేట పట్టణానికి చెందిన కోలాటం బృందం సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో ఈ బృందం పాల్గొని తిరుమలలో కోలాటం ప్రదర్శించింది. విశాఖపట్నానికి చెందిన హరిప్రియ భజన మండలి గురువు చుండూరు పరమేశ్వర శర్మ, శిరీష ఆధ్వర్యంలో పాల్గొన్నట్టు భజన, కోలాట బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వి.రజని, సంధ్య, వెంకటలక్ష్మి, లోవలక్ష్మి, మణిదీపిక, సత్యభవానీ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మాకవరపాలెం: ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో తామరానికి చెందిన గంగిరెడ్ల నాయుడు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 36 టీంలు పాల్గొన్నాయి. విజేతలకు ప్రథమ బహుమగా రూ.16 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.13 వేలు, తృతీయ రూ.10వేలు, నాల్గవ బహుమతిగా రూ.7 వేల నగదు అందజేస్తామని నాయుడు తెలిపారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు

అనకాపల్లి రూరల్ : జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలకు గురువారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్టు ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు అన్ని కళాశాలలు విద్యార్థులకు సెలవులు ప్రకటించి, పాటించాలని, దసరా సెలవుల్లో ఏ కళాశాలలోను తరగతులు, పరీక్షలు,సమావేశాలు నిర్వహించకూడదన్నారు. సెలవుల సమయంలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే ఆ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లిటౌన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్)లో 2023-24 విద్యాసంవత్సరానికి గాను పదోవతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వతేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం www.apopenschool.ap.gov.inలో నమోదు చేసుకుని దగ్గరలో గల ఓపెన్ స్కూల్ సెంటర్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి, ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని ఆమె కోరారు.

లక్ష్మీ రూపాయ నమః

శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. భక్తులు వివిధ రూపాల్లో భక్తిప్రపత్తులతో అమ్మను పూజిస్తున్నారు. బుధవారం దుర్గాదేవిని మహాలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కశింకోట మండలం గొబ్బూరులో రూ.1.83 లక్షలు, మాకవరంపాలెం బీసీ కాలనీలో రూ.25 లక్షలు, చోడవరంలో రూ.లక్షల విలువైన కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించారు.



కశింకోట మండలం గొబ్బూరులో రూ.1.83 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ



మాకవరపాలెంలో కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గామల్లేశ్వర అమ్మవారు



చోడవరంలో మహాలక్ష్మిదేవి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీదుర్గాదేవి అమ్మవారి

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రైవాడ జలాశయంలో 8.40 లక్షల చేప పిల్లల విడుదల



రైవాడ జలాశయంలో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన 8.40 లక్షల చేప పిల్లలను డిప్యూటీ సీఎం చేతుల మీదుగా బుధవారం రైవాడ జలాశయంలో విడుదల చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో 3.40 లక్షలు, తాటిపూడి చేప పిల్లల పెంపకం కేంద్రం నుంచి 5 లక్షల చేపపిల్లలు కలిపి మొత్తం 8.40 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. వీటిలో మూడు అంగుళాల సైజులో ఉన్న 6.8 లక్షల రాగండి, 80 వేలు బొచ్చె, 80 వేలు మోసు రకాలను విడుదల చేసినట్టు మత్స్యశాఖ అధికార్లు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు వివరించారు. అదనంగా చేప పిల్లలను విడుదల చేసేలా విస్తీర్ణం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వి.లలితానాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ ఉ్రరూకుల గంగాభవానీ, స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మీ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, సర్పంచ్‌లు గూడెపు రాము, దాసరి సంతోష్‌కుమార్, కాటిపాం పెదనాయుడు, మండల సమాఖ్య అధ్యక్షురాలు జి.రమాదేవి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్, ఎఫ్‌డీవో టి.నాగమణి, విజయనగరం డిప్యూటీ డైరెక్టర్ నిర్మల, తాటిపూడి ఎఫ్‌డీవో సంతోష్ పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పన కేంద్రాలుగా స్కిల్ హబ్ సెంటర్లు



స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

నిరుద్యోగ యువకులకు స్కిల్ హబ్ సెంటర్లు వరంగా మారాయి. ఈ సెంటర్ల ద్వారా జిల్లాలో వేలాది మందికి ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పిస్తున్నారు. జిల్లాలో ఏడు స్కిల్ హబ్‌ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు.

- ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్, అదనంగా నాక్ శిక్షణ కేంద్రం
- ఏడు స్కిల్ హబ్‌ల ద్వారా ప్రారంభమైన శిక్షణ
- ప్రొడక్షన్ కెమిస్ట్రీ, డొమెస్టిక్ డేటా ఆపరేటర్, జీడీ అసిస్టెంట్, నర్సింగ్ కోర్సులు
- బ్యాచ్‌కు 30 నుంచి 60 మంది చొప్పున మూడు నెలల శిక్షణ
- ఇంటర్, అంతకంటే తక్కువ విద్యార్హత ఉన్న వారికి కూడా నైపుణ్య శిక్షణ
- ఈ ఏడాదిలో జిల్లాలో 655 మందికి శిక్షణ కల్పిస్తే..423 మందికి ఉద్యోగాలు
- మరో 270 మందికి కొనసాగుతున్న శిక్షణ

సాక్షి, అనకాపల్లి: విద్యార్హతలు, నైపుణ్యాన్ని బట్టి అందరికీ తగిన ఉపాధి లభించాలి.. ఇది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం నిరుద్యోగులకు వివిధ ట్రేడ్‌లలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉద్యోగావకాశాలను కూడా కల్పిస్తున్నారు. దీని కోసం రాష్ట్రంలో రెండు స్కిల్ యూనివర్సిటీలు, ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక స్కిల్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్కిల్ హబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అందులో భాగంగా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు 'స్కిల్ హబ్' పేరిట శిక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. డిగ్రీ, ఇంటర్మీడియట్, అంతకంటే తక్కువ చదువు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఆరు స్కిల్ హబ్‌ల ద్వారా శిక్షణ కల్పిస్తున్నారు. ఇంటర్మీడియట్, అంతకంటే తక్కువ చదువు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేశారు.

మూడు నెలల శిక్షణ కాలం..

ఈ ఏడాదిలో స్కిల్ హబ్‌ల ద్వారా జిల్లాలో 655 మంది నిరుద్యోగులకు శిక్షణ అందించగా వారిలో 423 మందికి శిక్షణ అనంతరం ఉద్యోగాలు కల్పించారు. మరో 270 మందికి ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నారు. స్కిల్ హబ్‌లో ఒక్కో బ్యాచ్‌లో 30 నుంచి 60 మందికి వరకూ ఉంటారు. వీరికి 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. మొత్తం ఏడు శిక్షణ కేంద్రాల్లో పలు కోర్సులు ఏర్పాటుచేశారు. వాటిలో ప్రధానమైనవి ప్రొడక్షన్ కెమిస్ట్రీ, డొమెస్టిక్ డేటా ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్. వీటితో పాటు పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. పరిశ్రమలకు అనుసంధానంగా ఇక్కడ శిక్షణ కల్పిస్తున్నారు. డిగ్రీ(బీఎస్సీ) కెమిస్ట్రీ పూర్తిచేసినవారికి ప్రొడక్షన్ కెమిస్ట్రీ కోర్సును డిజైన్‌చేశారు. 'జనరల్ డ్యూటీ అసిస్టెంట్', 'నర్సింగ్ కోర్సు' సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్ శిక్షణకు పదో తరగతి పాస్ అయిన వారందరూ అర్హులే. ఈకోర్సు శిక్షణ కాలం మూడు నెలలు. శిక్షణ కాలంలో ఇండస్ట్రియల్ నిపుణులతో ప్రత్యేక క్లాస్‌లను ఏర్పాటుచేస్తారు. కోర్సులో 30 నుంచి 40 మంది వరకు శిక్షణ కల్పిస్తారు.

➡ అనకాపల్లి రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో 'జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సు', సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్‌లకు గానూ 101 మందికి శిక్షణ అందించారు. వీరిలో 88 మందికి ఉద్యోగాలు కల్పించారు. ప్రస్తుతం మరో 60 మందికి శిక్షణ ఇస్తున్నారు

➡ నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ప్రొడక్షన్ కెమిస్ట్రీ, డొమెస్టిక్ డేటా ఆపరేటర్ కోర్సుల్లో 101 మందికి శిక్షణ అందించగా, వారిలో 88 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 30 మంది ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు

➡ చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలో 115 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 73 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 60 మంది ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు.

➡ మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 79 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 47 మందికి ఉద్యోగాలు కల్పించారు.

➡ పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 85 మందికి శిక్షణ ఇచ్చి, 47 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 30 మందికి రేపటి నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది.

➡ యలమంచిలిలో 107 మందికి శిక్షణ ఇవ్వగా వారిలో 62 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 30 మంది శిక్షణ పొందుతున్నారు.

➡ నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో 60 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 37 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 60 మంది ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నారు.

శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం



ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ని ఏర్పాటు చేశాం. స్థానికంగా ఉన్న పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించే విధంగా కోర్సులను సిద్ధం చేశాం. శిక్షణ పూర్తయిన తర్వాత ఆయా సంస్థలే ఉపాధి కల్పిస్తాయి. నిరుద్యోగులకు ఇది మంచి వరం. రవాణా సదుపాయం కోసం నెలకు రూ.1000 అందిస్తున్నాం. ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో ఆరు నైపుణ్య కేంద్రాల ద్వారా శిక్షణ అందించడమే కాకుండా.. మాకవరపాలెం నాక్ సెంటర్ కూడా ఏర్పాటుచేశాం.

– చాముండేశ్వర రావు, అనకాపల్లి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

27న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ పై ఆరా తీస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల: అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమస్థాయి తనిఖీని పరిశీలించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి కోరారు. కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ప్రచారదినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో గొర్లి సూరిబాబు(వైఎస్సార్‌సీపీ), కె.హరనాథబాబు(ఆప్), ఐ.ఆర్.గంగాధర్(కాంగ్రెస్), సీహెచ్ నాగేశ్వరరావు(బీజేపీ), బి.శ్రీనివాసరావు(టీడీపీ), ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, డీటీ రవికుమార్, ఎస్‌ఏ తులసీరాం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు భేష్

మాడుగుల: చీడికాడ మండలం పెదగోగాడ, చినగోగాడ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. చినగోగాడ అంగన్‌వాడీలో బరువు తక్కువ పిల్లలను గుర్తించి రికార్డులు పరిశీలించారు. రికార్డుల ప్రకారం పిల్లలు బరువు ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త ప్రీస్కూల్ పిల్లలకు సొంతంగా తయారు చేసిన ఆటవస్తువులతో పాటు అక్షరాల ఫ్లాష్ కార్డుల్ని పరిశీలించి, కార్యకర్తను అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార వినియోగంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. పెదగోగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించిన ఆయన పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రక్తహీనత గల పిల్లలను వివరాలను ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రజలకు నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను సూచించారు. కలెక్టర్ వెంట ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, మాడుగుల సీడీపీవో సీహెచ్ శ్రీదేవి, సూపర్‌వైజర్లు వి.ఈశ్వరమ్మ, పి.చిన్నమ్మలు ఉన్నారు.

జగనన్నకు చెబుదాంతో సమస్యలకు పరిష్కారం


జగనన్నకు చెబుదాంలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, అధికారులు


కార్యక్రమానికి హాజరైన జిల్లా, మండల స్థాయి అధికారులు

- మండల వ్యాప్తంగా 22 సమస్యలపై 211 అర్జీలు
- అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 111 దరఖాస్తులు

మాడుగుల: గ్రామీణ ప్రాంతాల్లో అట్టడుగు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం సాగుతోంది. మారుమూల గ్రామాల్లో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికీ ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ప్రజలకు ఈ కార్యక్రమం వరంలా మారింది. మండల కేంద్రం చీడికాడలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పాల్గొని ప్రజల సమస్యలు విని, అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి, సత్వరమే పరిష్కారం చూపాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాల్లో జరుగుతున్న జగనన్నకు చెబుదాం ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. అర్జీదారుల కోసం 10 కౌంటర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 22 రకాల సమస్యలపై 211 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో రెవెన్యూకు సంబంధించి 111, గృహనిర్మాణ శాఖకు 32, ట్రాన్స్‌కో సమస్యలపై 18, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో 8, వివిధ సమస్యలపై మిగిలిన 42 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజు, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, జేసీ జాహ్నవి, నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరామ్, ఏఎస్పీ విజయభాస్కర్, తహసీల్దార్ బి.వి.రాణి, మాడుగుల డీటీ సత్యనారాయణతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అందిన అర్జీల్లో కొన్ని..

- ఖండివరం గ్రామానికి చెందిన గల్లా దుర్గా ధర్మరాజు తన భూమిని ఆన్‌లైన్ చేయాలని అర్జీ పెట్టుకున్నారు. చాలా రోజులుగా తిరుగుతున్నా పని పూర్తి కాలేదని మొరపెట్టుకున్నారు.
- తునివలసకు చెందిన బయ్యవరపు నాగమణి తమ పూర్వీకుల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టా పాసుబుక్ లేదని, తమ పేరిట పాసుపుస్తం జారీ చేయాల్సిందిగా అర్జీ దాఖలుచేశారు.
- వరహాపురం గ్రామానికి చెందిన తూరుబిల్లి చిన తల్లి, తూరుబిల్లి పార్వతి తమకు స్థలంతోపాటు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అర్జీలు పెట్టుకున్నారు.

మాలాంటివారికి వరం



జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా స్థాయి అధికారులు మా దగ్గరకు వచ్చి సమస్యలు తెలుసుకుని అర్జీలు తీసుకుంటున్నారు. మాలాంటి వారికి వరంలాంటిది. నా కుమారుడు నవీన్ డిప్లమో చదివాడు. గత ఏడాది 3 వాయిదాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు. ఆగిపోయిన ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అందించాలని అర్జీ అందించాం.

– ముద్దుర్తి పార్వతీశం, వీరభద్రపేట

సాగుభూమికి ఆన్‌లైన్ చేయాలి



మండల స్థాయిలో మా గ్రామం దగ్గరకు జిల్లా కలెక్టర్ వచ్చి, మా సమస్యలు తెలుసుకోవడం ఆనందంగా ఉంది. జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో గ్రామ స్థాయి సమస్యలకు తక్షణ పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం పెరిగింది. మాలాంటి పేదలకు ఇదో వరంలాంటిది. మా సాగు భూమికి పాసుపుస్తకం కోసం అర్జీ పెట్టుకున్నా.

– ఎంగిలి దేవుడు, గిరి రైతు, చినకోనాం

వరికి ఊపిరి

- రూ.15 లక్షలతో స్లూయిస్ నిర్మాణం
- పనులు ఆఖరి దశకు చేరుకోవడంతో సాగు నీరు విడుదల
- డిప్యూటీ సీఎం చొరవతో 1500 ఎకరాలకు సాగునీరు
- ఊపిరి పీల్చుకున్న తారకరామ రిజర్వాయర్ ఆయకట్టు రైతులు


జలాశయం


తారకరామ ప్రధాన కాలువ నుంచి ప్రవహిస్తున్న నీరు

మాడుగుల: మండలంలోని రెండవ అతి పెద్ద జలాశయంగా పేరొందిన తారక రామ జలాశయం ప్రధాన పంట కాలువ ద్వారా ఆయకట్టుకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చొరవతో సాగు నీరు విడుదల అయ్యింది. ఈ జలాశయం పంట కాలువ స్లూయిస్ పూర్తిగా శిథిలమై సాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 1500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పొట్ట దశకు చేరుకున్న వరి చేను ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. ఇక్కడి సాగు నీటి ఇబ్బందులను స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజతో పాటు ఆయుకట్టు రైతులు సుమారు 15 రోజుల క్రితం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే శిథిలమైన స్లూయిస్ పునః నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో నిర్మాణ పనులు దాదాపుగా ఆఖరి దశకు చేరుకున్నాయి. అయితే పంటలు ఎండిపోయే పరిస్థితి రావడంతో తక్షణమే ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఆదేశించారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి ఎంపీపీ రామధర్మజ బుధవారం సాగునీటిని విడుదల చేశారు. రైతు కష్టం తెలిసిన నాయకుడిగా డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఎండిపోతున్న పంటలకు సాగునీటిని విడుదల చేయించి, ఊపిరి పోశారని ఆయకట్టు రైతులు పుట్టా కొండలరావు, కర్రి కొండలరావు, నీలం అప్పారావు, వేపాడ సోమునాయుడు, గాలి గోవింద్ డిప్యూటీ సిఎం చొరవ పట్ల ఆనందం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎంకు తామంతా రుణపడి ఉంటామని వారు తెలిపారు

జలాశయం పరిస్థితి ఇలా....

తారకరామ జలాశయం 25 ఏళ్ల క్రితం అసంపూర్తి పంట కాలువలతో నిర్మితమైంది. దీంతో సుమారు 4వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన 1500 ఎకరాలకే పరిమితమైంది. ప్రధాన పంట కాలువ ద్వారా సుమారు 1500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందేది. కొన్నేళ్లుగా ప్రధాన పంట కాలువ స్లూయిస్ పూర్తిగా శిథిలమైంది. గత రెండేళ్లు సమృద్ధిగా వర్షాలు కురవడంతో దీని కోసం పట్టించుకోలేదు. ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో నాలుగు గ్రామాలకు చెందిన 1500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటి సమస్య ఏర్పడింది.

ఆయకట్టు భూములన్నింటికీ సమృద్ధిగా నీరు



రానున్న కాలంలో నియోజకవర్గంలోని ఆయకట్టు భూములన్నింటికీ రెండు పంటలు పండే విధంగా సాగు నీరందించి, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యం. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తనకు రైతు కష్టాలు తెలుసు. ఆ దిశగానే నిరంతరం కృషి చేస్తున్నాను. నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారం కావడంతో నియోజకవర్గంలోని జలాశయాలన్నింటిని అంచెలంచెలుగా ఆధునికీకరణ చేసి గోదావరి డెల్టా భూములకు దీటుగా ప్రతీ నీటి బొట్టును ఒడిసి పట్టుకొని సాగు నీరు అందించేందుకు కృషి చేస్తాను.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం.

డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటాం



తారకరామ ప్రధాన పంట కాలువ స్లూయిస్ మధుం పూర్తిగా శిథిలమవడంతో పంట పొలాలకు అందాల్సిన సాగు నీరు వృథా పోతోంది. ఇదే విషయాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లగా రూ. 15 లక్షలు నిధులు మంజూరు చేయడంతో పాటు కేవలం15 రోజుల్లోనే స్లూయిస్ నిర్మించారు. ఎండిపోతున్న 1500 ఎకరాలకు సాగు నీరు అందించి ఊపిరి పోశారు. తారకరామ ఆయకట్టు రైతులంతా డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటాం.

– భీముని జగన్నాథరావు, రైతు సంఘం నాయకుడు, మాడుగుల

ఆనందంగా ఉంది



తారకరామ జలాశయం ప్రధాన మధుం శిథిలమవండంతో పంట పొలాలకు చుక్క నీరు అందడంలేదు. గత రెండేళ్లు వర్షాలు సమృద్ధిగా కురవడంతో తమకు నీటి సమస్య ఏర్పడలేదు. ఈ ఏడాది నీటి ఎద్దడి రావడంతో పొట్ట దశలో ఉన్న వరి చేను ఎండిపోతోంది. తమ సమస్యను చెప్పడమే తడువుగా డిప్యూటీ సీఎం మధుం నిర్మించి సాగు నీరు అందించడం ఎంతో ఆనందంగా ఉంది.

– కర్రి కొండలరావు, ఆయకట్టు రైతు, మాడుగుల

రెండు ఆలయాల్లో చోరీ

మునగపాక: మండలంలోని రెండు గ్రామాల్లోని ఆలయాల్లో హుండీల్లో నగదు చోరీ అయింది. మునగపాక బైపాస్ రోడ్డులోని సత్తెమ్మతల్లి ఆలయంలోని హుండీని పగులగొట్టి సుమారు రూ.2 వేల నగదును మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. తోటాడలోని భావనారుషి ఆలయంలో కూడా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి సుమారు రూ.4వేలకు పైగా నగదు చోరీ చేశారు. ఈ మేరకు మునగపాక పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి అలంకరణ

కొంకోట/మాకవరపాలెం: జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. దీనిలో భాగంగా కొంకోట మండలంలోని గొబ్బూరులో ఉన్న పంచక్షేత్రాలయం దుర్గాదేవిని రూ.1,83,500 విలువైన నోట్లతో అలంకరించారు. భక్తుల సేకరించిన రూ.10 నుంచి రూ.500 వరకు కొత్త నోట్లతో అమ్మవారు కొలువుదీరిన ప్రాంతాన్ని చూడ ముచ్చటగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సోమరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అలంకరించిన కరెన్సీ నోట్లను సమర్పించిన భక్తులకు గురువారం తిరిగి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాకవరపాలెం బీసీ కాలనీలో ఉన్న దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారిని రూ.25 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

చోడవరంలో..

చోడవరం: స్థానిక పాతబస్టాండ్ సమీపంలో శ్రీ దుర్గాదేవి ఆలయంలో బుధవారం కరెన్సీ నోట్లతో దుర్గాదేవిని అలంకరించారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు శివ ప్రత్యేక పూజలు చేశారు. భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే సీఎం లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- రైవాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సందర్శన


రైవాడలో పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : పేద ప్రజలకు గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. రైవాడలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. హెల్త్ క్యాంప్‌లో అన్ని కౌంటర్లను పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను సందర్శించారు. అనారోగ్య సమస్యలతో వచ్చే ప్రజల పట్ల ప్రేమతో పలకరించి అప్యాయంగా మెలగాలని వైద్య సిబ్బందికి డిప్యూటీ సీఎం సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ల్లో స్పెషలిస్టు డాక్టర్లతో వైద్య సేవలతో పాటు 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు చేస్తున్నారన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులతో పాటు పెద్దాసుపత్రులకు తరలిస్తున్నారన్నారు. ప్రజలంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్త్ క్యాంప్‌లో ఆర్థోపెడిక్ డా. జి.మధుసూధన్ యాదవ్, జనరల్ మెడిసిన్ డా. కె. దశరధిబాబు, జనరల్ వైద్యులు డా. బి. హారిక, డా.ఈ.పూజ్య మేఘన 316 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీపీరాజేశ్వరి, జెడ్పీటీసీసత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లలితానాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ గంగాభవానీ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ రమణ, మాజీ సర్పంచ్ తాతయ్యలు, ఎంపీడీవో సుబ్బలక్ష్మి, ఇంచార్జ్ ఈవోపీఆర్డి సంతోషి నళిని, ఎంఈవో-1 పడాల్‌దాస్, ఐసీడీఎస్ సీడీపీవో మంగతయారు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక

అనకాపల్లిటౌన్: రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు జయవీర్ బుధవారం తెలిపారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఈ నెల 20 నుంచి జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

సీబీఎస్‌ఈ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట : సీబీఎస్‌ఈ క్లస్టర్ 7 కబడ్డీ పోటీలు ఈ నెల 14 నుండి 16 వరకు హైదరాబాద్‌లోని గండిపేటలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ నుండి బాలుర విభాగంలో 54 జట్లు, బాలికల విభాగంలో 24 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించింది. బాలుర విభాగంలో ఫైనల్లో హీల్ స్కూల్ విజయవాడ జట్టు పై, శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ జట్టు 28-47 పాయింట్లతో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబర్ 24 నుండి 27 వరకు హర్యానా రాష్ట్రం కర్నాల్‌లో ఎస్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగే సీబీఎస్ఈ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు. ఆయా విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, అపర్ణ, నీలాదేవి, కోచ్ లక్ష్మణ్ అభినందించారు.

మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటా

- జిల్లా అదనపు ఎస్పీ విజయ్‌భాస్కర్


పోలీసు కుటుంబాలతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విజయ్‌భాస్కర్

అనకాపల్లిటౌన్: విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు తాను అండగా నిలుస్తానని జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయ్‌భాస్కర్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం పోలీసు కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు కుటుంబ సభ్యుల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడతానన్నారు. ఎలాంటి అవసరం వచ్చినా, నేరుగా తనను సంప్రదించాలని తెలిపారు. పోలీసు కుటుంబాలకు రావాల్సిన నగదు వివరాలను పరిపాలన అధికారి బి.శారద తెలిపారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ ఏటీఎం దొంగలు

- ఐదుగురికి రిమాండ్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్

అనకాపల్లి టౌన్ : స్థానిక పూడిమడక రహదారి ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధిస్తూ జిల్లా అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్ చెప్పారు. ఆయన స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. నిందితులు ఈ ఏడాది మే 27న పూడిమడక రహదారిలో ఎస్‌బీఐ ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి రూ.15,17,300 నగదు దోచుకెళ్లారని తెలిపారు. అదే నెల 28న హిటాచి పేమెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేస్తున్న యలమంచిలి నాగేంద్రకాలనీకి చెందిన కంఠంరెడ్డి సోమునాయుడు ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ చేసేందుకు తన సిబ్బందితో వెళ్లగా చోరీకి గురైనట్టు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి ఏటీఎం దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల కూడలి వద్ద తమ సిబ్బంది వాహనాలు తనిఖీల్లో భాగంగా విశాఖపట్నం నుంచి కాకినాడ వెళ్తున్న హెచ్‌ఆర్ 73ఏ 3526 నంబర్ గల లారీని నిలిపి తనిఖీ చేస్తుండగా హర్యానా రాష్ట్రానికి చెందిన పల్వాజీ జిల్లా హతిన్ గ్రామానికి చెందిన ఆరిఫ్‌ఖాన్, మెయోలీ విలేజ్‌కు చెందిన మహమ్మద్ముస్తు, షారుక్‌ఖాన్, అఖిల్ఖాన్, శంషేర్‌లు లారీలో ఆక్సిజన్ సిలిండర్‌తో పాటు చిన్న గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 16 మీటర్లు కలిగిన నీలం , ఎర్రటి రంగుల గ్యాస్ పైపు, రీడింగ్ మీటర్‌తో ఉన్న గ్యాస్ రెగ్యులేటర్, చిన్న గ్యాస్ రెగ్యులేటర్, ఐరన్ కటింగ్ అండ్ గ్రానైట్ యంత్రం, ఆరెంజ్ కలర్ సేఫ్టీ బెల్టు, ఫిస్టలను పోలిన లైటర్, సుత్తి, బ్లాక్‌స్ప్రే బాటిల్, ఐదు సెల్‌ఫోన్లు, రెండు బ్యాంకు చెక్‌లు, పేపర్ లోడింగ్(లారీ), 22 కేజీల గంజాయి పట్టుబడింది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఏటీఎం చోరీకి పాల్పడినట్టు అంగీకరించారని తెలిపారు. తమతోపాటు మరో ముగ్గురు ఉన్నారని తెలిపారన్నారు. నిందితుల నుంచి రూ.26వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో మొత్తం 8 మంది నిందితుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. పట్టుబడిన నిందితుల్లో శంషేర్ నేటి వరకు దేశంలో 40 ఏటీఎంల్లో చోరీకి పాల్పడినట్టు నిర్ధారించామన్నారు. వీరు లారీ ద్వారా సరుకులు రవాణా చేస్తూ జనసంచారం లేని రహదారులను ఎంచుకుంటూ ఏటీఎంల చోరీకి పాల్పడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ మళ్ల మహేష్, సీఐ దాడి మోహన్‌రావు, ఎస్‌ఐలు సింహాచలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకర్‌రావు


సచివాలయ ఉద్యోగులతో సమీక్షిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకర్‌రావు

మాడుగుల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఉద్యోగులు కృషి చేయాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి జి.ప్రభాకర్‌రావు తెలిపారు. చీడికాడ మండలం అప్పలరాజుపురంలో సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి, ఉద్యోగులతో సమీక్షించారు. అనంతరం ఆయన గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి చిన్నారుల తల్లులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు కోనాం, జైతవరం, అప్పలరాజుపురంలో పామాయిల్ తోటలను, ఎల్‌బీ పట్నంలో కోల్డ్‌స్టోరేజ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాదు, వీఆర్‌వో కొండలరావు, దేవరాపల్లి మండల ఉద్యానవనశాఖాధికారి పాల్గొన్నారు.

సారా కేసుల్లో పట్టుబడ్డ వాహనాల వేలం

చోడవరం రూరల్ : వివిధ సారా కేసుల్లో పట్టుబడ్డ రెండు ద్విచక్రవాహనాలను వేలం వేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.59 వేలు ఆదాయం సమకూరిందని చోడవరం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి.సిహెచ్.జోగమ్మ తెలిపారు. బుధవారం కార్యాలయం వద్ద నిర్వహించిన వేలంలో రెండు మోటార్ సైకిళ్లకు రూ.41వేలు పాట పాడగా, కనీస ధరగా రూ.50వేలు నిర్ధారించడంతో పాటదారు ఆ మొత్తానికి అంగీకరించారు. జీఎస్‌టీ పన్నుగా రూ.9 వేలు మొత్తం రూ.59వేలు నగదు చెల్లించడంతో దానిని ప్రభుత్వ ఖజానాకు జమ చేశామని చెప్పారు. విశాఖపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఆఫీసర్ ఎస్.బాలకృష్ణన్ సమక్షంలో వేలం నిర్వహించామన్నారు.ఇద్దరు అక్రమ మద్యం విక్రేతల నుంచి స్వాధీనం చేసుకున్న 37 లీటర్ల సారా, 66.6 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశామని తెలిపారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సేవా లోపంపై విద్యా సంస్థకు జరిమాన

విశాఖ లీగల్ : విద్యార్థి నుంచి తీసుకున్న సొమ్మును వెంటనే వాపస్ చేసి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాలని ఓ ఆన్‌లైన్ విద్యాసంస్థను ఆదేశిస్తూ విశాఖలోని వినియోగదారుల ఫోరం(రెండు) అధ్యక్షురాలు గేదెల వెంకటేశ్వరి బుధవారం తీర్పునిచ్చారు. సీనియర్ న్యాయవాది ఆడారి అప్పారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఫిర్యాది కర్రి త్రివేణి అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం గవర వీధిలో ఉంటున్నారు. ఆమె 2022 మేలో సింపుల్ లెర్న్ సొల్యూషన్ ద్వారా బెంగళూరులోని వర్చు యూనివర్సిటీతో ఆన్‌లైన్ విధానంలో ఎనలైటిక్స్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాంలో చేరారు. ప్రముఖ కంప్యూటర్ సొల్యూషన్ సంస్థ అయిన ఐబీఎం సహకారంతో కోర్సు నిర్వహిస్తారు. కోర్సులో చేరడానికి రూ.1,41, 610 ఫీజుగా చెల్లించవలసి ఉంది. త్రివేణి కోర్స్ చదవడానికి పలు దఫాలుగా సంస్థకు రూ.75,312 చెల్లించింది. అయితే ఆమెకు కోర్సులను ఆన్‌లైన్ విధానంలో సక్రమంగా అందించలేదు. బోధనా విధానం కూడా అర్థం కాలేదు. దీంతో త్రివేణి నగరంలోని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఫోరం అధ్యక్షురాలు వెంకటేశ్వరి సభ్యులు పి.విజయ దుర్గ, కరక రమణబాబు యాజమాన్యం విద్యా బోధన విధానంలో లోపం ఉన్నట్టు గుర్తించారు. విద్యార్థి ఇప్పటి వరకు చెల్లించిన 75,512 రూపాయలు వాపస్ చేయాలని, అలాగే ఎన్‌ఓసి ఇవ్వాలని, నష్ట పరిహారం కింద రూ. 20,000, ఖర్చుల నిమిత్తం రూ.10,000 నిమిత్తం చెల్లించాలని తమ తీర్పులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

పేదలకు ఆర్థిక చేయూత



పేదల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న దాడి రత్నాకర్, అతిథులు

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో 3 పేద కుటుంబాలకు రూ.6 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, దివంగత గంధం నందగోపాల్ 6వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అతని కుమార్తె లక్ష్మీ సునీత ఆధ్వర్యంలో జరిగిన సభలో ఒక్కొక్క పేద కుటుంబానికి రూ.2 లక్షల వంతున చెక్కులు అందజేశారు. అలాగే పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, ప్రతినిధులు గిరిధర్, కొణతాల హరినాథ్, ముక్కా శ్రీనివాసరావు, ఆల్ఫ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గొల్లవీధి యూపీహెచ్‌సీ పరిధిలో సురక్ష శిబిరం

అనకాపల్లిటౌన్ : గొల్లవీధి యూపీహెచ్‌సీ పరిధి నెయ్యిలవీధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని జెడ్పీ సుర వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన రోగులకు కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి, ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

నేడు మంత్రి అమర్‌నాథ్ పర్యటన

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధిపై సమీక్షించేందుకు, గొల్లవీధి యూపీహెచ్‌సీలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సందర్భంగా గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరు కానున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై కార్యక్రమానికి కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 1,162 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
మొదటి రకం	4,280	4,340
రెండో రకం	3,860	4,270
మూడోరకం	3,700	3,850

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
భగవంత్ కేసరి	:పర్తిసాయి
భగవంత్ కేసరి	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15 యూనిట్లు, బీ పాజిటివ్-110 యూనిట్లు, ఓ పాజిటివ్-7 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 464 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 421 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



అన్నపూర్ణాదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ



కుక్కుటేశ్వరీదేవిగా గౌరీదేవి



అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కరెన్సీ నోట్ల దండతో దుర్గమ్మవారు



అన్నపూర్ణాదేవి అవతారంలో సత్యనారాయణపురం కనకమహాలక్ష్మి



రాజరాజేశ్వరీదేవిగా కామాక్షమ్మవారు

ఓం కాత్యాయనాయ విద్మహే కన్యాకుమారి ధీమహి

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దసరా నాలుగో రోజు బుధవారం అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సారె సమర్పించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

- వేడుకగా కొనసాగుతున్న దసరా ఉత్సవాలు
- మండపాల్లో వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మిక శోభ



అమ్మవారిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్ తదితరులు



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ



అన్నసమారాధనను ప్రారంభించిన ఆలయ చైర్మన్ మురళీకృష్ణ



చండీహోమం నిర్వహిస్తున్న పీలా లక్ష్మీశ్రీనివాస్ దంపతులు



గౌరీదేవి అమ్మవారి సారె ఊరేగింపులో మహిళా భక్తులు



గమ్యస్థానాల వైపు నాటికలో ఒక దృశ్యం

అనకాపల్లిటౌన్ : దసరా ఉత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దేవాలయాలు, మండపాలు దేవీ నామస్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమపూజలు చేపట్టారు.

నూకాంబిక బాలాలయంలో విశేష పూజలు..
ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతిపూజ, కుంకుమపూజలు నిర్వహించారు. ఉదయం మాతృత్రయోరాధన, చండీహోమాలు ఆలయ ధర్మకర్త పీలా లక్ష్మీ శ్రీనివాసరావు దంపతులు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా సతకంపట్టు కనకదుర్గమ్మ..
స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో భవానీ మాలధారణ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు.

కుక్కుటేశ్వరీదేవిగా గౌరీపంచాయతన అమ్మవారు..
గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి కుక్కుటేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు పురవీధుల గుండా సాగింది. ఆలయ చుట్టుపక్కల మహిళలు పలు రకాల పిండి వంటలు తయారు చేసి అమ్మవారికి నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవి అవతారంలో కామాక్షిదేవి..
నిదానందొడ్డిలో కామాక్షమ్మ ఆలయంలో కామాక్షిదేవి అమ్మవారు భక్తులకు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు ఎస్.భారతి భాగవతారిణిచే శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్ర వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అవతారంలో కన్యకాపరమేశ్వరి..
స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకన్యకాపరమేశ్వరి శ్రీహరి భజన మండలి నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో కనకదుర్గమ్మవారు
కశింకోట : కశింకోట జాతీయ రహదారి పక్కన వెలసిన కనకదుర్గ అమ్మవారు బుధవారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి కరెన్సీ నోట్ల మాల వేసి ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు చేశారు. అలాగే ఆలయం దిగువన ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని కూడా కరెన్సీ నోట్లతో అలంకరించి పూజించారు. భవానీ భక్తులు, దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్. ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

అన్నపూర్ణే సదా పూర్ణే..
అనకాపల్లి రూరల్ : సత్యనారాయణపురం కనకదుర్గమ్మ అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు పర్యవేక్షణలో వేకువ జామున 4 గంటల నుంచే అమ్మవారికి పంచామృతాభిషేకాలు,కుంకుమ పూజలు నిర్వహించారు. కశింకోట ఆర్ఈసీఎస్ డీఈ ఎస్. రామకృష్ణ, ఏఈ కొణతాల ఆదికోటేశ్వర్రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీ, చైర్మన్ మేడిశెట్టి రామ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న రత్నాకర్..
అనకాపల్లిటౌన్ : శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడం ముదావహమని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం జగన్నాథ స్వామి ఆలయంలో నెలకొల్పిన కనకదుర్గమ్మను బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు దాడి ఈశ్వరరావు, పార్టీ శ్రేణులు కోటిపల్లి జేజిబాబు, కర్రి రమేష్, ఆళ్ల సాయికుమార్, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

వేడుకల వేళ.. ఆకట్టుకున్న నాటికలు..
అనకాపల్లిటౌన్ : స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మవారి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవ పోటీలను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. గౌరీ సంఘం ఆధ్వర్యంలో మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. గుంటూరు రసఝరి, పొన్నూరు-నిడుబ్రోలు వారు ప్రదర్శించిన త్రిజుడు నాటిక పలువురిని ఆలోచింపజేసింది. గోపరాజు విజయ్ రచన, దర్శకత్వం వహించారు. శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే గమ్యస్థానాల వైపు నాటికకు శ్రీస్నిగ్ధ రచన, దర్శకత్వం వహించారు. కాగా మనిషి ఔన్నత్యానికి, ఉత్తమత్వానికి నిదర్శనం మంచితనం, మానవత్వాలే కాని కులం, మతం, ధనం కాదనే సత్యాన్ని తెలియజేస్తూ త్రిజుడు నాటిక ముగుస్తుంది.

గమ్యస్థానాల వైపు..
సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఎదిరించి ముందుకెళ్లాలి. నిరాశా నిస్పృహలతో జీవితాన్ని నాశనం చేసుకోకూడదని చాటి చెప్పేది గమ్యస్థానాల వైపు నాటిక. గెలవడానికి ఎలా బ్రతకాలో చెప్పి దీనుల్లో పేరుకుపోయిన భయాన్ని, నిర్వేదాన్ని పోగొట్టి ఆత్మహత్య కరెక్ట్ కాదని చెప్పి వాళ్లను వాళ్ల గమ్యాలకు తరలించడంతో నాటిక ముగుస్తుంది.

ప్రజారోగ్య రక్షణే.. సీఎం జగన్ ధ్యేయం



వెదురుపర్తిలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్



తేగాడలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి



తేగాడలో వికలాంగురాలికి రక్త పరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఇప్పటి వరకు దాదాపు 5664 మందికి వైద్య సేవలందించారు. 35 మందికి కంటి శస్త్ర చికిత్సలు, 769 మందికి కళ్లద్దాలు ఇవ్వడానికి సిఫార్స్ చేశారు. మండలంలోని కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 20 సచివాలయాలున్నాయి. వాటిలో పీహెచ్‌సీలున్న ప్రాంతం సచివాలయాలు మినహా మిగిలిన 18 సచివాలయాల పరిధిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా మొదట ఈ నెల 3న జమాదులపాలెంలో శిబిరాన్ని నిర్వహించారు. అక్కడి నుంచి ఉగ్గినపాలెం, బయ్యవరం, కశింకోట 1,3,4 సచివాలయాలు, వెదురుపర్తి, తేగాడ, కొత్తపల్లి, జట్టపురెడ్డి తుని, చింతలపాలెం, నూతలగుంటపాలెం, జి. భీమవరం సచివాలయాల్లో శిబిరాలు జరిగాయి. అవసరమైన వారికి రక్త పరీక్షలు, బీపీ, మధుమేహం, రక్తహీనత, మూత్ర పరీక్షలు, మలేరియా, డెంగ్యూ పరీక్షలు, ఈసీజీ, కఫం సేకరణ వంటి పది రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. వ్యాధి తీవ్రతను అనుసరించి ఉన్నత వైద్యానికి జిల్లా ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నారు. దీంతో పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు శిబిరాల్లో సేవలు వినియోగించుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార పదార్థాలు ప్రదర్శించి వాటి ప్రాధాన్యతను వివరిస్తున్నారు. బాలింతలు, గర్భిణులు, ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. వెదురుపర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరిశీలించారు. అలాగే కశింకోట, బయ్యవరంతో పాటు కొత్తపల్లిలో నిర్వహించిన శిబిరాలను ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి సందర్శించారు. స్వయంగా గర్భిణులు, రోగులను పరీక్షించి వైద్య సేవలు కూడా అందించారు. అలాగే జి. భీమవరంలో కలెక్టర్ రవి పటాన్‌శెట్టి శిబిరాన్ని సందర్శించి వైద్యులు అందిస్తున్న సేవలను, అధికారులు చేసిన ఏర్పాట్లను ప్రశంసించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎ. హేమంత్, జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ తదితరులు శిబిరాలను పర్యవేక్షిస్తున్నారు.

తాళ్లపాలెం హైస్కూల్లో..
కశింకోట : మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి. రవి కుమార్ తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు, పీహెచ్‌సీ వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పకడ్బందీగా నిర్వహిస్తూ వైద్య సేవలందిస్తున్నాం. శిబిరాలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో ఇంకా 5 శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. అక్కడ కూడా శిబిరాలు నిర్వహిస్తే మొత్తంగా శిబిరాల నిర్వహణ పూర్తి అవుతుంది.

-యు. రమేష్, వైద్యులు, తాళ్లపాలెం పీహెచ్‌సీ

జగనన్న సురక్షతో.. నాణ్యమైన వైద్యం



శంకరంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



శంకరం సర్పంచ్ లక్ష్మికి బీపీ పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



శంకరం వైద్య శిబిరంలో రోగికి నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యాధికారిణి



గొల్లవీధి యూపీహెచ్‌సీలో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న జాజుల రమేష్

అనకాపల్లిటౌన్ : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోందని 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక గొల్లవీధి యపీహెచ్‌సీ పరిధిలో తాకాశివీధి సచివాలయం, మండలంలో శంకరం గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 రోజులుగా పట్టణ, మండలంలో పెద్ద ఎత్తున జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజలు తండోప తండాలు వచ్చి వారి సమస్యలు వైద్యుల వద్ద వివరించుకుంటున్నారు. 108, 104, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి వైద్యసేవలు గ్రామీణ, పట్టణాల్లో ఉన్నప్పటికీ నేరుగా రోగి వద్దకే వైద్యం అందజేయాలనే దృఢ సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

అంతకుముందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న పౌష్టికాహార ప్రదర్శనను వారు తిలకించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సురా వెంకటరమణ, ఎంపీడీవో కె.నర్సింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు, శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మీరామకృష్ణ దంపతులు, భట్లపూడి సర్పంచ్ గొంతిన షాజావాతి, ఎంపీటీసీలు ముమ్మిన అప్పలనాయుడు, మంత్రి సంతోషమ్మ, వైస్ సర్పంచ్ గుడాల తాతబాబు, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ నేతలు బెల్లాన అనురాధ, కె.కన్నబాబు, మాధురీనాయుడు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణంలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఈనెల 20వ తేదీన జంగిల్ క్లీనింగ్, వైర్ల మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) అధికారి కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో అంజయ్యకాలనీ, గాంధీనగరం, శ్రీరామ్‌నగర్, లక్ష్మీదేవిపేట, మిరియాలకాలనీ, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 3 గంటల వరకూ విద్యుత్‌ను నిలుపుదల చేస్తామని, ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

రేపు కొబ్బరి చెక్కల వేలం పాట

అనకాపల్లి రూరల్ : శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలకు ఈ నెల 20వ తేదీ శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో కె. శ్రీనివాసరావు తెలిపారు. కొండ దిగువన ఉన్న దేవస్థానం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు టెండరు కం బహిరంగ వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు ముందుగా రూ. 5 వేలు ధరావతు చెల్లించాలన్నారు. హక్కు పొందిన పాటదారులు నవంబర్ 14 నుంచి డిసెంబరు 12 వరకు కొబ్బరిచెక్కలు తీసుకోవచ్చన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు తమ వెంట ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు.

ఉరిపోసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్య

సబ్బవరం: తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం మండలం సిరిగండపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ దుర్గా వెంకట రమణమూర్తి (45) ఈ నెల 12న గుంటూరులో పెన్నా సిమెంట్ కంపెనీ నుంచి లోడ్‌తో అనకాపల్లి జిల్లా మునగపాకకు బయలుదేరాడు. ఈ నెల 16న ముగనపాక చేరుకున్న అతను బుధవారం మధ్యాహ్నం తర్వాత లారీ కేబిన్‌కు తాడు కట్టి ఉరిపోసుకున్నాడు. మృతుడి ఆధార్ కార్డు,మొబైల్ నెంబర్ ఆధారంగా లారీ యజమానికి సమాచారం అందించారు. స్థానిక వీఆర్వో శేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.